క్లుప్తంగా

కోనాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వే నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. కమిటీ సభ్యులు సిద్దిరాంలు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ



వెంకటస్వామి



రవీందర్

వెల్దుర్తి(తూప్రాన్): టీఎస్ యూటీఎఫ్ వెల్దుర్తి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావ్ తెలిపారు. అధ్యక్షుడిగా వెంకటస్వామి, ఉపాధ్యక్షుడిగా అక్బర్ అలీ, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా ఆనంద్ కుమార్ నియామకమయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24న మెదక్‌లోని టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో విద్య, ఉపాధ్యాయుల సమస్యల గురించి చర్చలు, పలు తీర్మానాలు చేయనున్నట్టు చెప్పారు.

గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేయిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్‌లోని బీటీ రోడ్డు నుంచి గ్రామం వరకు ఉన్న ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను మాజీ సర్పంచ్ రంగి లతకృష్ణ తన సొంత డబ్బులతో మొరం పోయించి చదును చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొర్వి కృష్ణస్వామి సేవలు మరువలేనివి



కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ముదిరాజ్‌ల ఐక్యత కోసం కృషి చేసిన కొర్వి కృష్ణస్వామి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని దుబ్బాక ముదిరాజ్ సంఘం ఇన్‌చార్జి పున్న రమేష్ పిలుపునిచ్చారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో కృష్ణస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గుర్రాల స్వామి, మధు, సుధాకర్, జెట్టి స్వామి, శ్రీనివాస్, చందా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లితోపాటు వెంకట్రావ్‌పేటలోని పలు ఎరువుల దుకాణాలను ఏఓ స్వప్న గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు విత్తనాలు అమ్మాలని చెప్పారు.

సీఎం కప్ పోటీల్లో విద్యార్థిని సత్తా



విద్యార్థిని శ్రీవల్లి

చిన్నశంకరంపేట(మెదక్): సీఎం కప్ క్రీడాపోటీల్లో చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని శ్రీవల్లి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభను చాటారు. మెదక్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీల్లో 100 మీటర్ల విభాగంలో రెండవ స్థానంలో నిలిచింది. జిల్లాస్థాయిలో ప్రతిభను చాటిన శ్రీవల్లిని ఎంపీడీఓ దామోదర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాణికుమారి, పీడీ బస్వరాజ్ అభినందించారు.

అందుబాటులో భారత్‌రైస్

- పది కిలోల బ్యాగ్ రూ.340
- ఒకరికి ఒక బ్యాగ్ మాత్రమే
- మెదక్‌లో విక్రయాలు ప్రారంభం

మెదక్ కలెక్టరేట్: ఎట్టకేలకు మెదక్ జిల్లా కేంద్రంలో భారత్‌రైస్ అందుబాటులోకి వచ్చాయి. పేద ప్రజలకు తక్కువ ధరకే బియ్యం అందజేయాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. జిల్లాలో వర్షాకాలం, యాసంగి రెండు దఫాలుగా వరి పంటలు పుష్కలంగా పండుతున్నప్పటికీ బియ్యం ధరలు మాత్రం తగ్గడం లేదు. జిల్లాలోనే కాదు రాష్ట్రం, దేశం మొత్తం ఇదే పరిస్థితి ఉంది. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. పేదలకు తక్కువ ధరలో బియ్యం అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా భారత్ రైస్ పేరిట పథకాన్ని ప్రారంభించి బియ్యం కిలో రూ.34 చొప్పున విక్రయిస్తుంది. ఈ పథకం కొన్నేళ్ల క్రితమే ప్రారంభించినప్పటికీ మెదక్ జిల్లా కేంద్రానికి మాత్రం చేరుకోలేదు. హైదరాబాద్, సిద్దిపేట వంటి పట్టణాల్లో కేంద్రీయ భండార్ విక్రయ కేంద్రాల ద్వారా భారత్‌రైస్ విక్రయిస్తున్నారు. 5 కిలోలు, 10 కిలోల బ్యాగుల్లో ఈ బియ్యం విక్రయిస్తున్నారు.

జిల్లాకు చేరిన భారత్‌రైస్

మెదక్‌లో ఏర్పాటైన రిలయెన్స్ సూపర్ మార్కెట్‌లో భారత్ రైస్ విక్రయిస్తున్నారు. 10 కిలోల బ్యాగ్ రూ.340ల చొప్పున అమ్ముతున్నారు. ఒక కస్టమర్‌కు ఒక బ్యాగ్ మాత్రమే అందజేస్తున్నారు. అయితే వీటిపై ప్రచారం లేక పోవడంతో ప్రజలు బియ్యం



మెదక్‌లోని రిలయెన్స్ సూపర్ మార్కెట్‌లో విక్రయిస్తున్న భారత్ రైస్

కొనుగోలు చేయలేక పోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో దొడ్డు బియ్యం విక్రయాలు జరగడం లేదు. కేవలం రేషన్ దుకాణాలు మాత్రమే దొడ్డు బియ్యం ఉచితంగా సరఫరా చేస్తున్నారు. రేషన్‌కార్డు లేని ప్రజలు బియ్యం కొనుగోలు చేయాలంటే రూ.6,000లతో సన్నబియ్యం కొనుగోలు చేయాల్సిందే. నాణ్యతను బట్టి బియ్యాన్ని పలు ధరల్లో విక్రయిస్తున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు

బియ్యం రకం	పాతవి ధర	కొత్తవి ధర
జయశ్రీ	రూ.7,200	రూ.7,000
హెచ్‌ఎంటీ	రూ.6,600	రూ. 6,000
స్టీమ్ రైస్	రూ.5,600	రూ.5,000

త్వరలో సంచార వాహనం ద్వారా విక్రయాలు

ప్రస్తుతం నాఫెడ్‌బజార్.కాం, కేంద్రీయ భండార్ విక్రయ కేంద్రాలు, పలు సూపర్ మార్కెట్‌ల ద్వారా భారత్ రైస్, గోధుమ పిండి, శనగ పప్పు విక్రయిస్తున్నాం. ప్రస్తుతం గోధుమ పిండి అందుబాటులో లేదు. త్వరలోనే మొబైల్ వాహనం ద్వారా భారత్‌రైస్ విక్రయించడం జరుగుతుంది. మెదక్ జిల్లాకు కూడా భారత్‌రైస్‌కు సంబంధించిన ఒక మొబైల్ వాహనం త్వరలోనే రానున్నట్లు హైదరాబాద్‌లోని నాఫెడ్ నిర్వహణ అధికారి జ్యోతి తెలిపారు.

నాఫెడ్ ద్వారా విక్రయాలు

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) నుంచి సేకరించిన బియ్యాన్ని భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (ఎన్ఏఎఫ్ఈడీ), భారత జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య(ఎన్‌సీసీఎఫ్) ఇప్పటికే భారత్ గోధుమపిండి కిలో రూ.27.50, భారత్ శనగ పప్పును రూ.60 చొప్పున నాఫెడ్ బజార్.కాం తదితర ఈ-కామర్స్ సైట్‌లలో విక్రయిస్తున్నారు. అలాగే భారత్ రైస్ సైతం ఇదే తరహాలో విక్రయాలు ప్రారంభించారు.

ఏడాదిగా వెలగని వీధి దీపాలు

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు



విద్యుత్ అధికారులలో మాట్లాడుతున్న స్థానికులు

అల్లాదుర్గం(మెదక్): ఏడాదిగా వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులు విద్యుత్ అధికారులను నిలదీశారు. గురువారం అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామంలోని పలు కాలనీల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి. విద్యుత్ స్తంభాలకు లైట్లు వెలగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆరో వార్డులో గత ఏడాది కాలంగా విద్యుత్ దీపాలు వెలగడం లేదని వాపోయారు. దీంతో రాత్రి వేళ్లలో బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొందని అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది బల్బులు పెట్టిన రెండు రోజుల్లో చెడిపోతున్నాయని అన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి పనులు షురూ..



కొనసాగుతున్న అండర్‌పాస్ పనులు

చిన్నశంకరంపేట(మెదక్): శంకరంపేట మెయిన్ రోడ్ నుంచి కామారం తండాకు వెళ్లే రహదారిపై రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో శంకరంపేట-వల్లూర్ జాతీయ రహదారికి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కామారం తండా వాసులు మిర్జాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే అండర్‌పాస్ ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వాహనదారులు గమనించి మిర్జాపల్లి రైల్వే అండర్‌పాస్ రోడ్డును ఉపయోగించుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

మాలమహానాడు నాయకుల అరెస్ట్

శివ్వంపేట(నర్సాపూర్): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు చేపట్టిన అసెంబ్లీ ముట్టడిని అడ్డుకునేందుకు పోలీసులు ఆ సంఘం నాయకులను గురువారం ముందస్తు అరెస్టులు చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబూరావు, యాదగిరి, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులను ముందస్తు అరెస్ట్ చేసి కొద్దిసేపటి తర్వాత విడుదల చేశారు.

ముందస్తు అరెస్ట్

రేగోడ్(మెదక్): అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న మాల మహానాడు నాయకులను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బుచ్చయ్య, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, బాలయ్య తదితరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పోచయ్య తెలిపారు.

మెదక్ మున్సిపాలిటీ: మాల మహానాడు నాయకులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లా



కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంజీవ్ తదితరులు

సుధాకర్, కొల్చారం యాదగిరి తదితర నాయకులు ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మాలమహానాడు నాయకుల అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బుధవారం అర్ధరాత్రి స్థానిక ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌తోపాటు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివ, మండల అధ్యక్షుడు కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గురువారం సాయంత్రం సొంతపూచికత్తుపై విడుదల చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో గల దుర్గా రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యం పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి 246 సంచులతో ఉన్న రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారి ద్రోణాచార్యులు తెలిపారు.



బియ్యం లారీతో అధికారులు

ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకురాలు శ్రీలత సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులను అధ్యాపకురాలు శ్రీలత గురువారం ఎమ్మార్వో కార్యాలయానికి తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రభుత్వ అధికారుల విధులు, రికార్డుల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ, కంప్యూటరీకరణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి



కొట్టాలలో వననర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): వనమహోత్సవం లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలు పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని కొట్టాలలో ఉపాధిహామీ వన నర్సరీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని నర్సరీలలో అయిదువేల మొక్కలు పెంచాలన్నారు. మొక్కల పెంపకం కోసం ఎర్రమట్టితో బ్యాగ్స్ నింపి విత్తనాలు నాటాలని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలు ఏపుగా పెరిగేలా సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఇందిరమ్మ' సర్వే

అల్లాదుర్గం(మెదక్): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా సాగుతోంది. అల్లాదుర్గం పట్టణంలో గురవారం పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ టీఏలు ఇంటింటికి వెళ్లి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ దరఖాస్తుదారుల జాబితా ప్రకారం సర్వే పక్కగా చేయాలన్నారు. నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



అల్లాదుర్గంలో సర్వే చేస్తున్న సిబ్బంది



కౌడిపల్లి: వెల్మకన్నలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



శివ్వంపేటలో రోడ్డుపక్కన ఆరుబయట చలిలో నిద్రిస్తున్న రాజస్థాన్‌కు చెందిన వలస కార్మికులు.

వలస కార్మికుల గజ గజ

శివ్వంపేట(నర్సాపూర్): చలికి వలసకార్మికులు అల్లాడి పోతున్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటకు రాజస్థాన్‌కు చెందిన సీసకమ్మర కులవృత్తి కార్మికులు వచ్చారు. పగలంతా రోడ్డు పక్కనే పనిచేసి రాత్రి ఆరుబయట చలిలో నిద్రపోతున్నారు. కాగా కొద్దిరోజులుగా చలి విపరీతంగా పెరగడంతో చలికి వణుకుతూనే ఆరుబయట నిద్రిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- కౌడిపల్లిలోని గోదాంలో వృథాగా వ్యవసాయ ఉపకరణాలు
- వినియోగించడం లేదు, రైతులకు ఇవ్వలేదు
- చెత్త కుప్పగా పేరుకుపోయిన విత్తన కాటన్లు
- చెదలుపట్టి గడువు తీరిన వైనం



కౌడిపల్లి వ్యవసాయశాఖ గోదాంలో చెత్తగా వస్తువులు

కౌడిపల్లి(నర్సాపూర్): లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి వ్యవసాయ ఉపకరణలు రైతులకు ఉపయోగం లేకుండా వృథాగా పడి ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఉపకరణాలు పాడైపోయిన ఈ దృశ్యాలు కౌడిపల్లి ఏడీఏ కార్యాలయ వ్యవసాయశాఖ గోదాంలో దర్శనమిచ్చాయి. వివరాల్లోకి వెళ్తే.. కౌడిపల్లి ఏడీఏ కార్యాలయం పక్కన వ్యవసాయశాఖ గోదాం ఉంది. అందులో వందల సంఖ్యలో కాటన్ డబ్బాల్లో రైతులకు ఉపయోగపడాల్సిన లింగా కర్షక బుట్టలు కాటన్ డబ్బాల్లో ఉండి చెదలు పట్టిపోయాయి. వ్యవసాయ అధికారులు కనీసం వాటిని విప్పకుండా వదిలేశారు. దీంతోపాటు భూసార పరీక్షలకు వినియోగించాల్సిన రిఏజంట్స్ బాటిల్స్ డబ్బాలకు డబ్బాలు పడి ఉన్నాయి. అలాగే, రైతుల భూసారం పెంచే ట్రికోదర్మావిరిడి బయో ఫర్టిలైజర్ ప్యాకెట్లు సంచుల్లోనే ఉండిపోయాయి. రైతు బంధు, రైతు బీమా పత్రాలు, పంటల సాగు వివరాల పుస్తకాలు సైతం చెత్తలో పడేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రూ.లక్షలు ఖర్చుచేసి వ్యవసాయ కార్యాలయానికి పంపగా అధికారులు వాటిని వినియోగంచలేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా వృథాగా ఉంటున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ విషయమైన ఏఓ మాట్లాడుతూ మేము రాకమందు నుంచి అవి అలాగే ఉన్నాయని వాటి గురించి తమకు తెలియదని చెప్పారు.



గోదాంలో వృథాగా పడి ఉన్న లింగాకర్షక బుట్టలు



భూసార పరీక్షలుకు ఉపయోగించే బాక్స్‌లు

చెరుకు తోట దగ్ధం

రూ.6 లక్షల నష్టం

హవేళిఘణాపూర్(మెదక్) : విద్యుదాఘాతంతో చెరుకు తోట దగ్ధమైన ఘటన మండల పరిధిలోని బీ.భూపతిపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మంద సాయిలు, నర్సింలు, రమేశ్, సంజీవ్, నాజీలకు చెందిన చెరుకు తోట ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దాదాపు 8 ఎకరాల వరకు దగ్ధమైంది. రూ. 6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మెదక్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేయగా అప్పటికే తోట దగ్ధమైంది.

సంక్షిప్త వార్తలు

◆ 22న ఉమ్మడి మెదక్ ఖోఖో జట్టు ఎంపిక

నర్సాపూర్ : ఉమ్మడి మెదక్ జిల్లా ఖో ఖో సీనియర్ జట్టును 22న ఎంపిక చేయనున్నట్లు జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజులు తెలిపారు. నర్సాపూర్‌లోని అల్లూరి సీతరామరాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాల కాలేజీ ఆవరణలో ఈ ఎంపికలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 8 నుంచి 11 వరకు వరంగల్ జిల్లా గీసుగొండలో జరిగే 57వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో పాల్గొనే వారు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని 22న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98665 46563, 94406 99225 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

◆ హెచ్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయ ఉద్యోగ ఖాళీలకు అనుగుణంగా గెజిటెడ్ హెచ్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్ డిమాండ్ చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు రవీందర్‌రెడ్డి, భూపాల్, రాజేశం, జాన్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ పేదలందరికీ ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

మిరుదొడ్డి(దుబ్బాక): పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వంశీ కుమార్, సుమలత, వెంకటేశం, చందు, విజయ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు బహిరంగ వేలం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండపోచమ్మ ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటలకు ఆలయం వద్ద వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగానే డీడీలు, డిపాజిట్‌లు చెల్లించి వేలం పాల్గొనాలని కోరారు.

◆ రాష్ట్ర మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్‌లో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25 నుండి 28వరకు సంగారెడ్డిలో రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయన్నారు. కెరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. బండ్ల స్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ రూ.50వేల ఆర్థిక సహాయం

దుబ్బాకటౌన్: ఆపదలో ఉంటే ఆదుకోవడమే నిజమైన స్నేహానికి అర్థమని నిరూపించారు ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001- 2002 బ్యాచ్ 10వ తరగతి స్నేహితులు. తమ స్నేహితురాలు బాల్‌లక్ష్మి భర్త నర్సింహులు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకుని వారు గురువారం రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.50వేల ఆర్థిక సహాయం, 50కిలోల బియ్యం అందజేశారు. కనకయ్య, స్వామి, శ్రీరామ్, సత్యనారాయణ, రాజు, శ్రీలత, రాజేశ్వరి, జ్యోతి, భార్గవి, సత్యలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

◆ మత్తుకు బానిసలు కావొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): యువత మత్తుకు బానిసగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఇక్రిశాట్ విశ్రాంత శాస్త్రవేత్త హనుమంతరావు అన్నారు. రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లుపల్లిలో గురువారం 2కే రన్ నిర్వహించారు. యాంటీ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విన్నర్లకు మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్ తోట కమలాకర్‌రెడ్డి, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి నునిగాని రాజు, నాయకులు సూకూరి లింగం, వడ్లూరి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అహ్మద్, మాజీ ఎంపీటీసీ భైరయ్య, ధర్మారం కుమార్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.